08-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - బాబా నుండి సకాష్ ను తీసుకునేందుకు సుగంధమయమైన పుష్పాలుగా అవ్వండి, ఉదయముదయమే లేచి స్మృతిలో కూర్చొని ప్రేమగా బాబాతో మధురాతి-మధురమైన మాటలను మాట్లాడండి"

ప్రశ్న:- బాబాను పిల్లలందరూ నంబరువారుగా గుర్తు చేస్తారు, కానీ బాబా ఏ పిల్లలను గుర్తు చేస్తారు?

జవాబు:- ఏ పిల్లలైతే చాలా మధురముగా ఉంటారో, ఎవరికైతే సేవ తప్ప ఇంకేదీ తోచనే తోచదో, ఎవరైతే అతి ప్రేమగా బాబాను గుర్తు చేస్తారో, ఆ సంతోషములో ఎవరైతే ప్రేమ అశ్రువులను కారుస్తారో, అటువంటి పిల్లలను బాబా కూడా గుర్తు చేస్తారు. బాబా దృష్టి పుష్పాల వైపుకు వెళ్తుంది. ఏమంటారంటే - ఫలానా ఆత్మ చాలా మంచిది, ఈ ఆత్మ ఎక్కడ సేవను చూస్తే అక్కడకు పరిగెడుతూ ఉంటుంది, అనేకుల కళ్యాణము చేస్తుంది. కావున బాబా అటువంటివారిని గుర్తు చేస్తారు.

ఓం శాంతి. బాబా కూర్చొని ఆత్మలందరికీ అర్థం చేయిస్తారు. శరీరమూ గుర్తుకువస్తుంది, అలాగే ఆత్మ కూడా గుర్తుకువస్తుంది. శరీరము లేకుండా ఆత్మను గుర్తు చేయలేరు. ఈ ఆత్మ మంచిది అని లేక ఈ ఆత్మ బాహ్యాముఖి అని, ఈ ఆత్మ ప్రపంచ షికారు చేయాలనుకుంటోంది అని, ఈ ఆత్మ ఆ ప్రపంచాన్ని మర్చిపోయి ఉంది అని అర్థం చేసుకోవడం జరుగుతుంది. మొదట వారి నామ, రూపాలు ఎదురుగా వస్తాయి. ఫలానావారి ఆత్మను గుర్తు చేయడం జరుగుతుంది. ఫలానా ఆత్మ మంచి సేవను చేస్తుంది, తన బుద్ధియోగం బాబాతో ఉంది, తనలో ఈ-ఈ గుణాలు ఉన్నాయి అని అనుకునేటప్పుడు మొదట శరీరాన్ని గుర్తుచేసుకోవడం జరుగుతుంది, ఆ తర్వాత ఆత్మ గుర్తుకువస్తుంది. మొదట శరీరము గుర్తుకువస్తుంది, ఎందుకంటే శరీరము పెద్దది కదా. ఆ తర్వాత ఆత్మ, ఏదైతే చాలా సూక్ష్మముగా, చిన్నగా ఉందో, అది గుర్తుకువస్తుంది. ఈ పెద్ద శరీరానికి ఏ విధమైన మహిమ చేయడం జరుగదు. వీరి ఆత్మ మంచి సేవ చేస్తుంది, ఫలానావారి ఆత్మ వీరి కన్నా మంచిది అని ఆత్మకే మహిమ చేయడం జరుగుతుంది. మొదటైతే శరీరము గుర్తుకువస్తుంది. తండ్రికైతే అనేక ఆత్మలను గుర్తు చేయవలసి ఉంటుంది. వారికి శరీరము యొక్క పేరు గుర్తుకు రాదు, కేవలం రూపం ఎదురుగా వస్తుంది. ఫలానావారి ఆత్మ అని అనడంతో శరీరము తప్పకుండా గుర్తుకువస్తుంది. ఈ దాదా శరీరములోకి శివబాబా వస్తారని భావిస్తారు. వీరి తనువులో బాబా ఉన్నారని తెలుసు. శరీరము తప్పకుండా గుర్తుకువస్తుంది. మేము ఎలా స్మృతి చేయాలి? శివబాబాను బ్రహ్మా తనువులో స్మృతి చేయాలా లేక పరంధామములో స్మృతి చేయాలా? అని అడుగుతారు. అనేకమందికి ఈ ప్రశ్న ఉత్పన్నమవుతుంది. బాబా అంటారు, గుర్తు అయితే ఆత్మనే చేయాలి కానీ శరీరము కూడా తప్పకుండా గుర్తుకువస్తుంది. మొదట శరీరము, ఆ తర్వాత ఆత్మ. బాబా వీరి శరీరములో కూర్చున్నప్పుడు మరి తప్పకుండా శరీరము గుర్తుకువస్తుంది. ఫలానా శరీరము గల ఆత్మలో ఈ గుణము ఉంది అని అంటారు. బాబా కూడా చూస్తూ ఉంటారు - ఎవరు నన్ను గుర్తు చేస్తున్నారు? ఎవరిలో అనేక గుణాలు ఉన్నాయి? ఏయే పుష్పములో సుగంధము ఉంది? పుష్పాలపై అందరికీ ప్రేమ ఉంటుంది. పుష్పగుచ్ఛాన్ని తయారుచేస్తారు. అందులో రాజు, రాణి, ప్రజ, భిన్న-భిన్న పుష్పాలు, ఆకులు మొదలైనవాటన్నింటినీ ఉపయోగిస్తారు. బాబా దృష్టి పుష్పాల వైపుకు వెళ్తుంది. అప్పుడు ఏమంటారంటే - ఫలానా ఆత్మ చాలా మంచిది, చాలా సేవ చేస్తుంది, ఆత్మాభిమానిగా ఉంటూ బాబాను స్మృతి చేస్తూ ఉంటుంది, ఎక్కడ సేవ కనపడితే అక్కడకు పరిగెడుతూ ఉంటుంది. అయినా ఉదయమే లేచి స్మృతిలో కూర్చున్నప్పుడు ఎవరిని గుర్తు చేస్తారు? శివబాబా పరంధామములో గుర్తుకువస్తారా లేక మధుబన్ లో గుర్తుకువస్తారా? బాబా గుర్తుకు వస్తూ ఉండవచ్చు కదా. వీరిలో శివబాబా ఉన్నారు ఎందుకంటే బాబా అయితే ఇప్పుడు కిందకు వచ్చేసారు. మురళిని వినిపించేందుకు కిందకు వచ్చారు. వీరికి తమ ఇంట్లోనైతే పనేమీ ఉండదు, అక్కడకు వెళ్ళి ఏమి చేస్తారు? ఈ తనువులోకే ప్రవేశిస్తారు. కావున మొదట తప్పకుండా శరీరమే గుర్తుకువస్తుంది, ఆ తర్వాత ఆత్మ గుర్తుకువస్తుంది, ఫలానా శరీరములో ఏ ఆత్మ అయితే ఉందో, అది అన్యమైనది, మంచిది, ఆ ఆత్మకు సేవ తప్ప ఇంకేమీ తోచదు, చాలా మధురమైనది అని ఆ ఆత్మ గుర్తుకువస్తుంది. బాబా కూర్చొని ఉంటారు, అందరినీ చూస్తూ ఉంటారు. ఫలానా కుమార్తె చాలా మంచిది, ఎంతగానో స్మృతి చేస్తూ ఉంటుంది అని భావిస్తారు. బంధనాలలో ఉన్న కుమార్తెలకు వికారాల విషయంలో ఎన్ని దెబ్బలు పడుతూ ఉంటాయి! వారు ఎంత ప్రేమగా స్మృతి చేస్తూ ఉండవచ్చు! ఎప్పుడైతే బాగా స్మృతి చేస్తారో, అప్పుడు ఆ సంతోషములో ప్రేమ అశ్రువులు కూడా వస్తాయి. అప్పుడప్పుడూ ఆ అశ్రువులు కింద పడతాయి కూడా. బాబాకు వేరే ఏం పని ఉంది? అందరినీ గుర్తు చేస్తూ ఉంటారు. చాలామంది కుమార్తెలు గుర్తుకువస్తారు. ఫలానా ఆత్మలో శక్తి లేదు, బాబాను స్మృతి చేయదు, ఎవరికీ సుఖాన్ని ఇవ్వదు, తాను తన కళ్యాణమునే చేసుకోదు అని బాబా ఇదే పరిశీలిస్తూ ఉంటారు. గుర్తు

చేయడము అనగా సకాష్ ను ఇవ్వడము. ఆత్మ కనెక్షన్ పరమాత్మతో ఉంటుంది కదా. ఒకానొక రోజు వస్తుంది, అప్పుడు పిల్లలు యోగములో ఎంతగానో ఉంటారు. వీరు కూడా ఎవరినైనా గుర్తు చేస్తే, వాళ్ళకు వెంటనే సాక్షాత్కారమవుతుంది. ఆత్మ అయితే చిన్న బిందువు. కావున సాక్షాత్కారం పొందినా సరే ఎవరూ అర్థం చేసుకోలేరు, అయినా మళ్ళీ శరీరమే గుర్తుకువస్తుంది. ఆత్మ చిన్నగా ఉంటుంది, కానీ స్మృతి చేస్తే ఆ ఆత్మ పావనముగా అవుతూ ఉంటుంది. పుష్పాలతోటలో వెరైటీ పుష్పాలు ఉంటాయి. ఫలానావారు చాలా మంచి సుగంధమయమైన పుష్పము, ఫలానావారు అంతగా కాదు అని బాబా కూడా చూస్తూ ఉంటారు. అటువంటివారికి పదవి కూడా తక్కువగా ఉంటుంది. బాబాకు ఎవరైతే సహాయకులుగా అవుతారో, వారే ఉన్నత పదవిని పొందుతారు. అందులోనూ ఎవరైతే బాబాను స్మృతి చేస్తూ ఉంటారో వారు. బ్రాహ్మణుల నుండి ట్రాన్స్ఫర్ అయి దేవతలుగా అవుతారు. వీరు దైవీ పుష్పమా లేక అసురీ పుష్పమా? అన్న ఈ వర్ణనను కూడా సంగమములోనే చేయగలరు. అందరూ పుష్పాలే కానీ వెరైటీ ఎంతో ఉంది. బాబా కూడా గుర్తు చేస్తూ ఉంటారు. టీచర్ తమ విద్యార్థులను గుర్తు చేస్తారు కదా. వీరు తక్కువగా చదువుతున్నారు అని తమ హృదయములోనైతే అర్థం చేసుకుంటారు కదా. ఇక్కడ వీరు తండ్రి కూడా, టీచర్ కూడా. తండ్రిగానైతే ఎలాగూ ఉన్నారు. టీచర్ పాత్ర ఎక్కువ నడుస్తుంది. టీచర్ అయితే రోజూ చదివించాలి. ఈ చదువు యొక్క శక్తితో వారు పదవిని పొందుతారు. ఉదయం వేళ సోదరులైన మీరందరూ తండ్రి స్మృతిలో కూర్చుంటారు, అది స్మృతి అనే సబ్జెక్ట్, ఆ తర్వాత మురళి వినిపించడం జరుగుతుంది, అది చదువు అనే సబ్జెక్ట్, ముఖ్యమైనవి స్మృతి మరియు చదువే. వీటిని జ్ఞానము మరియు విజ్ఞానము అని కూడా అంటారు. ఇది జ్ఞాన-విజ్ఞాన భవనము, ఇక్కడకు తండ్రి వచ్చి నేర్పిస్తారు. జ్ఞానము ద్వారా మొత్తం సృష్టి జ్ఞానమంతా లభిస్తుంది. విజ్ఞానము అనగా మీరు యోగములో ఉంటారు, తద్వారా మీరు పావనముగా అవుతారు. మీకు దీని అర్థము గురించి తెలుసు. తండ్రి పిల్లలను చూస్తూ ఉంటారు. దేహీ-అభిమానులుగా అవ్వడం వల్లనే భూతాలు తొలగిపోతాయి. అలాగని అందరి భూతాలు వెంటనే తొలగిపోతాయని కాదు. లెక్కాచారాలు ఎప్పుడైతే తీరుతాయో, అప్పుడు నడవడిక అనుసారంగానే పదవిని పొందుతారు, క్లాస్ ట్రాన్స్ఫర్ అవుతారు. ఈ ప్రపంచము యొక్క ట్రాన్స్ఫర్ కిందివైపుకు అవుతోంది మరియు మీ ట్రాన్స్ఫర్ పైకి అవుతోంది. ఎంత తేడా ఉంది. ఆ కలియుగవాసులు మెట్లు కిందకు దిగుతూ ఉంటారు మరియు పురుషోత్తమ సంగమయుగవాసులైన మీరు మెట్లు పైకి ఎక్కుతూ ఉంటారు. ప్రపంచమైతే ఇదే, ఇది కేవలం బుద్ధి పని. మేము సంగమయుగవాసులము అని మీరు అంటారు. పురుషోత్తములుగా తయారుచేయడానికి తండ్రికి రావలసి ఉంటుంది. మీ కొరకు ఇప్పుడు ఇది పురుషోత్తమ సంగమయుగము, మిగిలినవారంతా ఘోర అంధకారములో ఉన్నారు. వారు భక్తిని ఎంతో గొప్పగా భావిస్తారు, ఎందుకంటే జ్ఞానం గురించి వారికి ఏమాత్రమూ తెలియదు. మీకు ఇప్పుడు జ్ఞానము లభించింది, కావుననే మీరు అర్థం చేసుకున్నారు. జ్ఞానము యొక్క ఒక్క చిటికెడుతో అర్థకల్పం కొరకు మనం పైకి ఎక్కిపోతాము. ఇక తర్వాత అక్కడ జ్ఞానం విషయము ఉండదు. ఈ విషయాలన్నింటినీ మహారథులైన పిల్లలే విని, ధారణ చేసి, మళ్ళీ వినిపిస్తూ ఉంటారు. మిగిలినవారంతా ఇక్కడ నుండి వెళ్ళగానే ఇక సమాప్తము. కర్మ, అకర్మ, వికర్మల రహస్యాన్ని కూడా భగవంతుడే అర్థం చేయిస్తారు. ఇది కల్పము యొక్క సంగమయుగము. ఇప్పుడు పాత ప్రపంచము సమాప్తమై కొత్త ప్రపంచ స్థాపన జరుగనున్నది. వినాశనం ఎదురుగా నిలబడి ఉంది. మీరు సంగమయుగములో నిలబడి ఉన్నారు, ఇతర మనుష్యుల కొరకు కలియుగము నడుస్తోంది. ఇది ఎంతటి ఘోర అంధకారము. కిందకు పడుతూనే ఉంటారు. కింద పడేయడానికి ఎవరో ఒకరు నిమిత్తము కూడా అవుతారు కదా, అతడే రావణుడు.

ఈ సభలో వాస్తవానికి పతితులెవ్వరూ కూర్చోలేరు. పతితులు వాయుమండలాన్ని పాడు చేస్తారు. ఒకవేళ ఎవరైనా తెలియకుండా వచ్చి కూర్చున్నా సరే, వారికి దెబ్బ కూడా తగులుతుంది, ఒక్కసారిగా పడిపోతారు. ఈశ్వరీయ సభలో ఎవరైనా అసురులు వచ్చి కూర్చుంటే అది వెంటనే తెలిసిపోతుంది. అప్పటికే రాతిబుద్ధి కలవారిగా ఉన్నారు, ఇప్పుడింకా ఎక్కువ రాతిబుద్ధి కలవారిగా అయిపోతారు, 100 రెట్ల శిక్ష పడుతుంది, తమను తాము నష్టపరుచుకుంటారు. వీరికి తెలుస్తుందో లేదో చూద్దాము అని అనుకుంటారు. నాకేమవుతుంది? ఎవరు చేస్తే వారు పొందుతారు. నేను తెలుసుకోవలసిన అవసరం కూడా లేదు. తండ్రితో ఎల్లప్పుడూ సత్యంగా ఉండాలి. సత్యము ఉన్న చోట మనస్సు ఆనందముతో నాట్యం చేస్తుంది అని అంటారు. సత్యంగా ఉన్నట్లయితే తమ రాజధానిలో కూడా నాట్యం చేస్తారు. తండ్రి ట్రూత్ (సత్యము), కావున పిల్లలు కూడా సత్యంగా అవ్వాలి. శివబాబా ఎక్కడ ఉన్నారు? అని బాబా అడుగుతారు. వీరిలో ఉన్నారు అని జవాబిస్తారు. పరంధామాన్ని వదిలి ఆ దూరదేశ నివాసి పరాయి దేశములోకి వచ్చారు. వారు ఇప్పుడు ఎంతో సేవను చేయాలి. తండ్రి అంటారు, నేను ఇక్కడ రాత్రింబవళ్ళు సేవ చేయవలసి ఉంటుంది, సందేశకులకు, భక్తులకు సాక్షాత్కారాలు చేయించవలసి ఉంటుంది. అది ఇక్కడే చేయవలసి ఉంటుంది, అక్కడైతే ఏ సేవా లేదు, సేవ లేకుండా బాబాకు సుఖం అనిపించదు, మొత్తం ప్రపంచమంతటి సేవను చేయాలి. బాబా,

రండి అని అందరూ పిలుస్తారు. బాబా అంటారు, నేను ఈ రథములోకి వస్తాను, దీనికి బదులుగా వారు గుర్రపు రథాన్ని తయారుచేసారు. ఇప్పుడు గుర్రపు రథములో శ్రీకృష్ణుడు ఎలా కూర్చుంటారు! అలాగని గుర్రపు రథములో కూర్చోవాలి అనే అభిరుచి ఉంటుందని కూడా కాదు.

దేహీ-అభిమానులుగా మరియు దేహాభిమానులుగా అయ్యే విషయాలు సంగమయుగములోనే ఉంటాయి మరియు తండ్రి తప్ప ఈ విషయాలను ఇంకెవ్వరూ అర్థం చేయించలేరు కూడా. మీకు కూడా ఇప్పుడే తెలుసు. ఇంతకుముందు తెలియదు. మరి గురువెవరైనా నేర్పించారా? గురువులనైతే ఎందరినో ఆశ్రయించారు, కానీ ఎవ్వరూ నేర్పించలేదు. ఎంతోమంది గురువుల వద్దకు వెళ్తారు. ఎవరి ద్వారానైనా శాంతి మార్గము లభిస్తుందేమోనని భావిస్తారు. తండ్రి అంటారు, శాంతిసాగరుడు అయితే ఒక్క తండ్రే, వారే తమతో పాటు తీసుకువెళ్తారు. సుఖధామము, శాంతిధామము గురించి ఎవ్వరికీ తెలియదు. కలియుగములో శూద్ర వర్ణము ఉంటుంది, పురుషోత్తమ సంగమయుగములో బ్రాహ్మణ వర్ణము ఉంది. ఈ వర్ణాలను గురించి కూడా మీకు తప్ప ఇంకెవ్వరికీ తెలియదు. ఇక్కడ వింటారు, బయటకు వెళ్ళడంతో అంతా మర్చిపోతారు, ధారణ జరుగదు. తండ్రి అంటారు, ఎక్కడకు వెళ్ళినా సరే, బ్యాడ్జి పెట్టుకుని ఉండాలి, ఇందులో సిగ్గుపడవలసిన విషయమేమీ లేదు, దీనిని బాబా ఎంతో కళ్యాణము కొరకు తయారుచేయించారు. ఎవరికైనా అర్థం చేయించి ఇవ్వండి. వివేకవంతులు ఎవరైనా ఉంటే వారు, వీటిని తయారుచేయడానికి మీకు ఖర్చు అయి ఉంటుంది కదా అని అంటారు. అప్పుడు - ఖర్చు అయితే తప్పకుండా అవుతుంది, కానీ పేదవారి కోసం ఇది ఫ్రీ అని చెప్పండి. అప్పుడు ఆ విషయాన్ని వారు ధారణ చేస్తే, ఉన్నత పదవిని పొందగలరు. పేదవారి వద్ద ధనమే లేకపోతే మరి వారేమి చేస్తారు. కొందరి వద్ద ధనం ఉంది కానీ పిసినార్లుగా ఉన్నారు. ఇతను ప్రాక్టికల్ గా చేసి చూపించారు, సర్వస్వాన్ని మాతలకు అప్పజెప్పారు. మీరు కూర్చుని అంతా సంభాళించండి అని అన్నారు ఎందుకంటే - చివరిలో ఏమీ గుర్తుకురాకూడదు అన్న జ్ఞానమైతే ఇప్పుడు లభించింది కదా. అంత్యకాలములో ఎవరైతే స్త్రీని స్మరిస్తారో... అని అంటారు. పెద్ద భవనాలు మొదలైనవి ఉంటే అవి తప్పకుండా గుర్తుకువస్తాయి, కానీ కొద్దిగా జ్ఞానాన్ని విన్నా ప్రజలలోకి తప్పకుండా వస్తారు. బాబా పేదల పాలిటి పెన్నిధి. కొందరి వద్ద ధనం ఉంటుంది, అయినా కానీ పిసినార్లుగా ఉంటారు. మొదటి వారసుడైతే శివబాబాయే అని భావించరు. భగవంతుడు అయితే భక్తి మార్గములో కూడా వారసుడే కదా. ఈశ్వరార్థము ఇస్తారు. దానం ఇచ్చేందుకు వారేమైనా పేదవారా? ఈశ్వరుని పేరు మీద పేదలకు ఇస్తే ఈశ్వరుడు ప్రతిఫలాన్ని ఇస్తారు అని భావిస్తారు. అది మరుసటి జన్మలో లభిస్తుంది. దానం ఇచ్చినట్లయితే గ్రహణం తొలగిపోతుంది అని అంటారు. బాబాకు సర్వస్వాన్ని ఇచ్చేసారు. శరీరము, మిత్ర-సంబంధీకులు మొదలైనవాటన్నింటినీ బాబాకు సమర్పణ చేసేసారు. ఈ సర్వస్వమూ మీదే అని అన్నారు. ఈ సమయములో మొత్తం ప్రపంచానికి గ్రహణం పట్టి ఉంది. అది ఒక్క క్షణములో ఎలా తొలగిపోతుంది, నల్లగా ఉన్నవారు తెల్లగా ఎలా అవుతారు, ఇది ఇప్పుడు మీకే తెలుసు, మళ్ళీ ఇతరులకు అర్థం చేయిస్తారు. ఎవరైతే - మేము లోలోపల అర్థం చేసుకుంటున్నాము కానీ ఇతరులకు అర్థం చేయించలేము అని అంటారో, వారు కూడా ఎందుకూ పనికిరారు. బాబా అంటారు, దానం ఇచ్చినట్లయితే గ్రహణం తొలగిపోతుంది. నేను మీకు అవినాశీ రత్నాలను ఇస్తున్నాను, వాటిని అందరికీ ఇస్తూ ఉండండి, అప్పుడు భారత్ పై మరియు మొత్తం ప్రపంచమంతటిపై రాహు గ్రహణం ఏదైతే కూర్చుందో, అది దిగిపోతుంది మరియు బృహస్పతి దశ ఏర్పడుతుంది. అన్నింటికన్నా మంచిది బృహస్పతి దశ. విశేషముగా భారత్ పై మరియు మిగిలిన ప్రపంచమంతటిపై రాహు గ్రహణము పట్టి ఉందని ఇప్పుడు మీకు తెలుసు, అది ఎలా తొలగుతుంది? వీరు తండ్రి కదా. తండ్రి మీ నుండి పాతదంతా తీసుకొని కొత్తది ఇస్తారు. దీనిని బృహస్పతి దశ అని అంటారు. ముక్తిధామములోకి వెళ్ళేవారి దశను బృహస్పతి దశ అని అనరు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సదా సంతోషములో నాట్యం చేస్తూ ఉండేందుకు సత్యమైన తండ్రితో సదా సత్యంగా ఉండాలి. ఏదీ దాచకూడదు.

2. బాబా ఏ అవినాశీ రత్నాలనైతే ఇస్తారో, వాటిని అందరికీ పంచాలి. దానితో పాటు శివబాబాను తమ వారసునిగా చేసుకొని సర్వస్వాన్ని సఫలం చేసుకోవాలి. ఇందులో పిసినార్లుగా అవ్వకూడదు.

వరదానము:- బిందువు మరియు నీటి చుక్క యొక్క మహత్వాన్ని తెలుసుకుని తమ శ్రేష్ఠ స్థితిని తయారుచేసుకునే

సిద్ధి స్వరూప భవ
శివ పరమాత్ముని పూజలో ఒకటేమో బిందువుకు విశేషత ఉంటుంది, రెండవది చుక్క-చుక్కకు విశేషత ఉంటుంది. రెండింటికీ తమ-తమ మహత్వము ఉంది. ఆత్మ, పరమాత్మ మరియు ప్రకృతి యొక్క ఈ ఆట అనగా డ్రామా, ఈ మూడింటి జ్ఞానము ప్రాక్టికల్ జీవితములో బిందువుగా అనుభవమవుతుంది. అలాగే నీటి చుక్క అనగా శుద్ధ సంకల్పాల స్మృతి, దీని ద్వారా మిలనము యొక్క సిద్ధి అనుభవమవుతుంది. ఆత్మిక సంభాషణలో ప్రాప్తులు అనే శీతల నీటి చుక్కలను బాబాపై వేస్తారు, దీని ద్వారానే శ్రేష్ఠ స్థితి తయారవుతుంది, దీని స్మృతిచిహ్నమే భక్తిలో కూడా నడుస్తుంది.

స్లోగన్:- ఎక్కువగా మాట్లాడటం వలన మెదడు యొక్క ఎనర్జీ (శక్తి) తగ్గిపోతుంది, అందుకే షార్ట్ అండ్ స్వీట్ గా (క్లుప్తంగా మరియు మధురంగా) మాట్లాడండి.